# విమానపు ప్రయాణాలు

వేమూరి వేంకటేశ్వరరావు

విమానపు ప్రయాణాలంటే విసుగేస్తోంది. ఈ రోజుల్లో కించిత్ భయం కూడా వేస్తోంది.

పూర్వం విమాన ప్రయాణం చేసేం అంటే అది సంఘంలో మన అంతస్థుకి ఒక గుర్తు, గుర్తింపు. ఇప్పుడో? ప్రతి అబ్బడ్డమైనవాడూ, అంకుపాలెం వెళ్ళినట్లు అమెరికా వెళ్ళి వచ్చేస్తున్నాడు. పడవలో కాదు, విమానంలో. నిన్న మొన్నటి వరకూ చెంబుచ్చుకుని బయలు కెళ్ళడానికి మించి ఇంటి గుమ్మం దాటని వాడు కూడ అకస్మాత్తుగా విమానం ఎక్కేయడంతో "దోసెడు కొంపలో పశుల రేణము" అని శ్రీనాథుడు అన్నట్లు విమానాలు తయారయాయి.

చెంబు, రేణము అనగానే గుర్తుకొస్తోంది. మన ఇండియన్సు ఎక్కువ మంది ఎక్కిన విమానాలలో ఒక దృగ్విషయం గమనించేను. అందరికీ ఆ 'టోయ్‌లెట్' కి వెళ్ళవలసిన అవసరం ఒక్కసారే వస్తుంది – ఎవరో సింక్రనైజ్ చేసినట్లు. ఒకసారి, నిక్కచ్చిగా చెప్పాలంటే 1964 లో, ఒక ప్రొపెలర్ విమానాన్ని అంతటినీ అద్దెకు మాట్లాడుకుని, భారతీయులం ఇండియా వచ్చేం. తెల్లవారే సమయానికి అందరం విమానం తోకలో ఉన్న టాయ్‌లెట్ దగ్గర బారులు తీసేం. పైలట్ "విమానం ముందు భాగం తేలిపోతోంది, కొంచెం ఎరువకి జరగండి బాబూ" అని మొర పెట్టుకున్నాడు. ఎద్దు బండిని తోలే ఎర్రన్న ఎల్లప్పుడూ అనే "ఎరువకి రావాలి బాబూ" అన్న ఆశీర్వచనం జ్ఞాపకం వచ్చింది.

నేనిలా రాస్తూ ఉంటే, "ఆఁ ఇండియన్స్ మీకు మరీ లోకువ అయిపోయారు. ప్రతి చిన్న విషయానికీ మీరు అలా విరుచుకు పడటం బాగా లేదు" అని కొందరు ఆప్తులు నన్ను పక్కకి పిలచి కసురుకున్నారు.

మీరే చెప్పండి. ప్రపంచంలో ఏ దేశమేగినా, ఎందు కాలిడినా, ఇటువంటి ప్రవర్తన ఎక్కడేనా చూసేరేమో మీరే చెప్పండి. ప్రయాణీకులని విమానం ఎక్కించడానికి సీటునంబర్ల వారీగా పిలుస్తారు. అవునా? మన వాళ్ళు కుక్కిన పేలల్లా సిబ్బందిని ఇబ్బంది పెట్టకుండా బుద్ధిగా ప్రవర్తిస్తారు – ప్రతి దేశంలోనూ, ఒక్క ఇండియాలో తప్ప. మీరు, ఇండియాలో ఏ విమానాశ్రయంలో చూడండి. విమానం తయారుగా ఉందని వినగానే మూడు వందల మంది ఒక్కుమ్మడి గేటు దగ్గరకి పరిగెడతారు, విమానం ఎక్కడానికి. క్రమశిక్షణకి మరోపేరని పేరు తెచ్చుకున్న సింగపూరు విమానాల వాడే మన వాళ్ళని, మన దొమ్మీ తత్వాన్నీ, అదుపులో పెట్టలేక ఒక దండం పెట్టి ఊరుకున్నాడు.

విమానాలే కాదు. విమానాశ్రయాలు కూడ అలాగే తగలడ్డాయి. అమెరికాలో నలుగురు ప్రయాణం చేస్తున్నారంటే వారిని ఎయిర్‌పోర్టులో దింపడానికి సగటుని ఒకడో అరో వెళతాడు. మనం అయితే, మనదేశంలో అయితే, ఒక్కడిని సాగనంపడానికి ఎంచక్కా ఇంటిల్లిపాదీ వెళతాం. చెన్నయ్ విమానాశ్రయానికి సాయంకాలం ఆరు దాటిన తర్వాత వెళితే ప్రజలంతా దేశం ఖాళీ చేసేసి తరలి వెళ్ళి పోతున్నారేమో అన్న భావన కలుగుతుంది. అంత కిటకిటలాడుతూ ఉంటుంది. రద్దీలో విమానాలు, విమానాశ్రయాలు కూడ బస్సుల కంటె, బస్సు స్టేండుల కంటె కనికిష్టంగా తయారయాయి.

అసలు విమాన ప్రయాణపు తీరే మారిపోయింది. అందులోనూ ఇండియా ప్రయాణాలు మరీ అన్యాయంగా తయారయాయి. పూర్వం ఒక కంపెనీ విమానంలో టికెట్టు కొనుక్కున్నామంటే, అదే టికెట్టుతో ఏ కంపెనీ విమానమేనా ఎక్కనిచ్చేవారు. ఒక రోజు బండి తప్పిపోతే మర్నాడు బండిలో పంపేవారు.
ఇప్పుడో? రిజర్వేషన్ చేయించుకున్న విమానంలో బయలుదేరక పోతే జరిమానా వేస్తానంటున్నాడు.

పూర్వం విమానం ఎక్కినప్పుడల్లా అందరికీ చిన్న సిగరెట్టు పెట్టి, నాలుగు చాకలేట్లు, ఆడుకుందికి పేక దస్తా, ఉత్తరాలు రాసుకుందికి కాగితాలు, మధ్యలో ఏదైనా కావలస్తే తిండానికో తాగడానికో ఏదో ఇచ్చేవారు.

ఇప్పుడో? కంటికి కనిపించనంత కాగితం పొట్లాంలో అంగుడికి అందనన్ని వేరుసెనగ గింజలు వేసి ఇస్తున్నారు. శాకాహారం కావలసి వచ్చినా, కిటికీ సీటు కానీ, నడవ సీటు కానీ, మరేవిధమైన ప్రత్యేకమైన ఏర్పాటు కావలసి వచ్చినా కంపెనీ వాడిని ఆరారా పిలచి జ్ఞాపకం చెయ్యాలి. చేసినా అడిగిన సీటు వస్తుందేమోకాని అడిగిన తిండి వస్తుందని అనుకోవడం అవివేకమే అవుతుంది.

బయలు దేరిన చోటునుండి చేరే చోటుకి, మధ్యలో బండి మారకుండా, ఏకాండీగా ఒకే ఒక విమానంలో వెళ్ళగలిగితే దానికి మించినది లేదు. కాని ఇది జరిగే పని కాదు. మనం ఏ మాంచెస్టర్, న్యూహేంప్షైర్ లాంటి శుద్ధ పల్లెటూరో వెళ్ళాలి. మనం రెండు ఘోషాణపు పెట్లు, రెండు చేతులతోటీ మోయడానికి వీలులేనంత బరువున్న రెండు చేతిసంచులతో న్యూయార్కులో వాలతాం. ఇక్కడ విమానం మారి మరో విమానం ఎక్కాలి. అవునా? అక్కడ విమానం బొంబాయి నుండి తీసుకొచ్చిన ఘోషాణపు పెట్టెలా ఉండదు – చిన్న అగ్గిపెట్టెలా ఉంటుంది.

ప్రయాణాలు చెయ్యడంలో ఎంతో అనుభవం సంపాదించిన నాలాటి వాడిని ఎవ్వరూ సలహా అడిగి చావరు కానీ, అడిగి చచ్చినవాళ్ళకి ఈ సందర్భంలో నేను ఒకటో అరో సలహాలు చెప్పగలను.

ప్రయాణం మొదలయే ముందే ఆ ''ఫ్లైట్ నంబర్లు'' ఒక సారి జాగ్రత్తగా చూసుకొండి. ఎందుకంటే విమానాలలో రెండు రకాలు ఉన్నాయి: పెద్దవి, బుల్లివి.
మీ ''ఫ్లైట్ నంబరు'' ఎంత పొడుగ్గా ఉంటే మీ విమానం అంత పొట్టిగా ఉంటుంది. ఈ బుల్లి విమానాలలో రెండు పుంజీలకి మించి సీట్లు ఉండవు. కనుక మీరు ఏ పది నెలల ముందో రిజర్వేషన్ చేయించుకుని ఉండకపోతే మీ సీటు మీకుంటుందన్న భరోసా ఏమీ లేదు. ప్రయాణం రెండు రోజులుందనగా, పదేసి నిమిషాలకి ఒక సారి ఎందుకేనా మంచిదని పిలవడం మంచిది. ఎందుకేనా మంచిది, మీ సామానుని ఏ ఫెడరల్ ఎక్స్‌ప్రెస్‌లోనో పంపెయ్యడం ఉత్తమం. అసలు ఆ ఫెడరల్ ఎక్స్‌ప్రెస్ వాడు ఒప్పుకుంటే మీరు కూడా అందులోనే ఎక్కేయడం ఉత్తమోత్తమం.

అసలు ఈ బుల్లి విమానాలతో ఈతి బాధలు ఇంకా చాల ఉన్నాయి. బండెక్కే ముందు 'బరువెంత?' అని అడుగుతాడు ద్వారపాలకుడు. అమ్మో! ఎక్కడేనా మీ బరువుని దాచిపెట్టండి కానీ ఇక్కడ కాదు. మీరు మొహమాట పడిపోయి, వాడు తూచొచ్చేడా ఏమిటి అని బరువుని తగ్గించి మాత్రం చెప్పకండి. వాడు ప్రయాణీకుల బరువునీ, సామాను బరువునీ ఉజ్జాయింపు వేసుకుని బండిలో పెట్రోలు కొడతాడు. ఓ దారిలో, ఆ మేఘాల మధ్య ఇంధనం అయిపోతే మన పని గోవిందా!

మరొక విషయం. మీరెంత ముందు జాగ్రత్తలో ఉన్నా బయలు దేరే వేళకి ఈ బుల్లి విమానాల వాడు మిమ్మల్ని బండెక్కనిస్తాడన్న భరోసా ఏమీ లేదు. ''ఎదురుగాలి కొడుతున్నాది కనుక బండిని సగం ఖాళీగా ఉంచకపోతే బండి గాలి లోకి లేవదు, కనుక మీలో సగం మందిని దిగవిడవక తప్పదు'' అంటాడు. ఇటువంటి

పరిస్థితులలో మనం మన స్టేటస్‌ని చాటి సీటు సంపాదించడానికి పట్టు చీరలు కట్టుకున్నా, నగలు పెట్టుకున్నా, సూటు వేసుకున్నా, మనకి ఇండియాలో ఎంత ఆస్తి ఉందో నెత్తీ నోరూ మొత్తుకున్నా పని చెయ్యదు. దీనికో చిటకా చెబుతాను. అప్పుడే సర్జరీ లోంచి వచ్చిన డాక్టరులా బొందుకట్టిన నీలం రంగు పజామా వేసుకుని, దానికింద ఒక నీలి రంగు జుబ్బా 'టక్' చేసి, ఒక గుడ్డ టోపీ – ఇది నీలి రంగుదే – పెట్టుకుని ఎయిర్‌పోర్టుకి వెళ్ళండి. కొంచెం ఓపిక పట్టి దారిలో ఏ 'టార్గెట్' లోనో ఆగి ఒక బీచ్ కూలర్ కొని దాని మీద ఎర్రటి అక్షరాలతో ''రష్! హ్యూమన్ ఆర్గన్'' అని రాసిన కాగితం అంటించేరంటే విమానంలో మీ సీటు కి మరి ఢోకా ఉండదు. గేటు దగ్గర ఆసామీ మిమ్మల్ని ''డాక్'' అని పిలిచినప్పుడు ఎవరిని పిలుస్తున్నాడు చెప్మా అని వెనక్కి తిరిగి మాత్రం చూడకండి.

మొత్తంమీద మన ఏడుపు ఏదో ఏడిచి, గేటు దాటి బయట పడ్డాం అనుకోండి. అక్కడ విమానం కనిపించదు; విమానానికి బదులు ఒక బస్సు ఉంటుంది. నిజంగా విమానం ఎక్కిస్తాడా లేక ఈ బస్సులోనే మనని మన గమ్యానికి తీసుకువెళతాడా అని అనుమానం వచ్చేలా ఒక పావుగంట సేపు ఆ ఎయిర్‌పోర్టులో ఉన్న సందులు, గొందులు అన్నీ చూపించి చివరికి అగ్గిపెట్టెలలా ఉన్న మూడు విమానాల గుంపు దగ్గర ఆపుతాడు.

బోయింగు 747 ఒక ఏనుగులా ఉంటే ఈ బుల్లి విమానాలు చిన్న చిట్టెలకల్లా ఉంటాయి. మీ చేతులో ''కేరీ ఆన్ బేగ్'' లాంటి సామాను ఏదైనా ఉంటే విమానం మెట్ల దగ్గర ఉన్న ఆసామీ అవన్నీ పుచ్చేసుకుని విమానం డిక్కీ లో వేస్తాడు. ఆ సమయంలో అతనికి ''టిప్పు'' ఇవ్వటం లాంటి పనులేవీ చెయ్యకండి. ఎందుకంటారా? అదే ఆసామీ విమానం నడపడానికి వస్తే మరి పావల్డబ్బులు చేతిలో పెడితే బాగుండదు.

మీరు చిన్నప్పుడు ఎప్పుడైనా చెరువు గట్టు దగ్గర నిలబడి చిల్లపెంకులతో నీళ్ళ మీద కప్పగంతులు వేయించేరా? ఒడుపు చూసుకుని చిల్లపెంకుని నీళ్ళ మీదకి విసిరితే  అది నీటి ఉపరితలం తాకుతూ, లేస్తూ, గెంతులు వేస్తూ వెళుతుంది. మన బుల్లి విమానం గాలిలోకి లేచిన తర్వాత ఇదే వరస అనుకోండి.  'యోయో' మాదిరి విమానంతో పాటు మన గుండె కాయ కూడా గొంతుక లోంచి గుండెల్లోకి, గుండెల్లోంచి గొంతుకలోకి వెళుతూ ఉంటుంది. కనుక విమానం బయలు దేరే లోగా ఒక 'వేలియం' మాత్ర గొంతుకలో పడేసుకుకోండి. మాత్ర వేసున్నాక ఒంటి మీద స్మారకం ఉండదు కనుక, మాత్ర వేసుకునే లోగా ఒక కాగితం మీద మీ పేరు, చిరునామా, కావలసినవాళ్ళ టెలిఫోను నంబరు, మీ ''బ్లడ్ టైపు'' వగైరా ముఖ్యాంశాలన్నీ ఒక కాగితం మీద రాసేసి ఆ కాగితాన్ని ఒక పిన్నుతో మీ బట్టలకి, నలుగురికీ కనిపించేలా, తగిలించేసుకోండి.

ఈ రోజుల్లో విమానపు ప్రయాణాలు పెరిగిపోవడంతో విమానాలు తోలే ఆసామీల గిరాకీ కూడ పెరిగిపోయింది. దీనితో పెద్ద పెద్ద జీతాలిచ్చి పెద్దపెద్ద పైలట్లని తీసుకురాలేని బుల్లిబుల్లి కంపెనీల వాళ్ళు వాళ్ళ బస్సు డ్రైవర్లనే విమానాలు తోలడానికి కూడ వాడేస్తూన్నట్లు వినికిడి. వీళ్ళకి 'రన్‌వే' ఏదో 'ఫ్రీవే' ఏదో తెలిసి చావడంలేదు. ఈ మధ్య ఇలా బుల్లి విమానాలు తోలి తోలి చివరికి చిన్న ప్రమోషను సంపాదించుకున్న ఒక బుల్లి విమానం  పైలట్ పరాకు చిత్తగిస్తూ బర్‌బేంకులో రన్‌వే మీద ఆపడం మానేసి విమానాన్ని నేరుగా ఊళ్ళో ఉన్న పెట్రోలు బంకు దగ్గర ఆపింది. కారు తోలుతున్నాననుకొంది కాబోలు. బండి ఆగే లోగా మరొక సారి  ''లిప్‌స్టిక్'' రాసుకుందుకని ''రియర్‌వ్యూ మిరర్'' లో చూసుకుంటూ ముందు దారి మాట మరిచిపోయి ఉంటుంది, పాపం.

ఈ సోదంతా మనకి ఇప్పుడు ఎందుకు కానీ విమానం ప్రయాణాలు మాత్రం పూర్వంలా "ఫన్" గా ఉండటం లేదు. విమానాలు బస్సుల్లా తయారయాయి. మరీ పిప్పళ్ళ బస్తాని కుక్కినట్లు కుక్కేస్తున్నాడు. కాళ్ళు జాపుకుందికి చోటు ఉండదు, ఒళ్ళు విరుచుకుందికి చోటు ఉండదు. పోనీ కన్ను మూసి కునుకు తీద్దామంటే వెనక సీట్లో ఉన్న ఆసామీ ఒడ్డీ మంగలాడిలా మనని గుద్దుతూ ఉంటే నిద్రెలా పడుతుంది? ఎలాగో సర్దుకుని కునుకు తీసేమనుకోండి. అదేమి కర్మో అప్పుడే విండో సీటులో కూర్చున్న వాడికి ఒంటేలుకి వస్తుంది.

ఇహ విమానంలో తిండి సంగతి. వాళ్ళు పెట్టే గడ్డి ఎలానూ తినలేమని తెలిసి కూడా బుద్ధి గడ్డి తిని "వెజిటేరియన్" భోజనం కావాలని అడిగేమనుకుందాం. మూడొంతుల ముప్పాతిక మనం అడిగిన ప్రత్యేక భోజనం వాళ్ళ కంప్యూటర్లో ఉండదు. "ఇకానమీ క్లాస్" లో ప్రయాణం చేస్తున్నామంటే మన పని గోవిందా. "ఎయిర్ హోస్టెస్" మీద అరిచి ప్రయోజనం లేదు.

పోనీ మన అదృష్టం బాగుండి దారిలో ఏ నక్కనో తొక్కి వచ్చేమనుకుందాం. అప్పుడు మనం అడిగిన "స్పెషల్ మీలు" ఉంటుంది. కాని ఉదయం, మద్యాహ్నం, సాయంకాలం అనే విచక్షణ లేకుండా, మూడు పూటలా ఒకే "మెన్యు" వాయించెస్తాడు. పోనీ వాడే పోయాడు, సరిపెట్టుకుందాంలే అనుకుని ఆ తిండి నోట్లో పెట్టుకుంటే దానికి రుచి, వాసన ఉండి చావవు. ఉత్త అట్ట ముక్కలా ఉంటుంది.

ఇలా "తిండి అట్టముక్కలా ఉంటుంది, రుచిగా ఉండదు" అంటూ నిందారోపణలు చేస్తూ ఉంటే, "ఆఁ మరీ డెక్కురుగొట్టు వాళ్ళలా ఏమిటా కబుర్లు. వాడు పెట్టే తిండికోసం ఎక్కుతామేమిటి వాడి విమానం?" అని ఒకావిడ నన్ను నిలదీసి అడిగింది.

"ఈ ప్రెషరైజు చేసిన విమానాలలో మన రుచిబొడిపెలు బాగా వికసించవండి. అంతేకాకుండా కేబిన్‌లో పీడనం వల్ల వంటకాలలో ఫ్లేవరు ఉండి చచ్చినా అది మన ఘ్రాణ నాడుల వరకు ఎగబాకదండి. అందుకని వాళ్ళు ఎంత బాగా వండినా ఈ విమానాలలో తిండి ఇంత కంటె రుచిగా ఉండడానికి వీలు లేదండి" అని జనరంజక విజ్ఞానంలో ప్రవేశం ఉన్న పెద్దమనిషొకాయన విమానాల వాళ్ళని వెనకేసుకు వచ్చాడు.

అయ్యా, ఈ విమానాలతో నేను పడుతూన్న యాతనలు అలా చెప్పుకుంటూ పోతే ఆ కథ హనుమంతుడి తోకలా అలా పెరుగుతూనే ఉంటుంది. కనుక ఆఖరు మాటగా మరొక్క ఉదంతం మనవి చేసుకుని శలవు తీసుకుంటాను.

నేనొకసారి సింగపూరు నుండి మెద్రాసు వెళ్ళడం తటస్థ పడింది. విమానం గాలి లోకి లేచి కాస్త కుదుట పడగానే నా ఎదురుగా ఉన్న సీటులో ఆసామీ ఒకాయన లేచేడు. లేచి ఓవర్‌హెడ్ కంపార్టుమెంటు తెరిచేడు. తెరిచి ఒక సంచీని కిందకి దింపేడు. దింపి అందులోంచి ఒక లుంగీని బయటకు తీసేడు. ఆ లుంగీని చుట్టబెట్టుకుని – ఆ వసారాలో నిలబడే – కట్టుకున్న పేంటుని లోపలనుండి బయటకు లాగేడు. లాగి దానిని మడత పెట్టి సంచీలో పెట్టేడు. అప్పుడు ఆ సంచీని యథతస్థానానికి చేర్చి, ఏదో బ్రహ్మ విద్య చేసిన వాడిలా నలుగురి వేపూ ఒకసారి చూసి తన సీటులో కూర్చున్నాడు. ఇదేదో స్లీపరు కోచ్ అనుకున్నాడో ఏమిటో. నా పక్కనున్న ఆడకూతురు మూర్చ వచ్చినదానిలా నా ఒళ్ళోకి ఒరిగి పోయింది. మద్రాసు వచ్చే వరకు ఆమెకు మరి మెలుకువ రాలేదు. ఆమ! దట్సిట్!